

గోల్డ్ మెడల్ సాధించిన వినయ్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

క్రీడలకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 89 కేజీల విభాగంలో నగరానికి చెందిన వినయ్ గోల్డ్ మెడల్ సాధించారు. శనివారం బర్కత్‌పురలోని నివాసంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలవగా వినయ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వినయ్ మరింత పట్టుదలతో రాణించి అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని కోరారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఖేలో ఇండియా క్రీడల్లో నైపుణ్యతను సాధించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎడెల్లి అజయ్‌కుమార్, నాయకులు అరుణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.



యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌గుప్తా

నిరుపేదలకు ఉచిత కాశీయాత్ర: అశోక్ గుప్తా

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాశీ ఆశ్రయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు నిరుపేదలకు ఉచిత కాశీయాత్ర నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు యాద అశోక్ గుప్తా, కార్యదర్శి బిలకంటి రాజు, కోశాధికారి యాద మంజుల తెలిపారు. వివిధ కుల సంఘాల ద్వారా నిరుపేదలను ఎంపిక చేసి ప్రతినెల కొంత మందిని ఉచితంగా కాశీ యాత్రకు తీసుకెళ్తున్నామని వారన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో కాశీయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శివరాత్రి నుంచి కార్యక్రమం చేపట్టామని, ఇప్పటి వరకు 110 మంది నిరుపేదలను కాశీయాత్రకు తీసుకెళ్లామని తెలిపారు.



మాట్లాడుతున్న గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గడిపెల్లి రాజేశ్వర్‌రావు కోరారు. శనివారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ ఆగర్వాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సేంద్రియ వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయని ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయం చేసే విధంగా రైతులను ప్రోత్సహించి పూర్తి అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు మురళీధర్‌రావు, రవి, భాస్కర్, రమేష్, వెంకట్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.

వరల్డ్ వీవర్స్ ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శారద



శారద పోరండ్ల

అంబర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ వీవర్స్ ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ప్రముఖ న్యాయవాది, ఫ్యామిలీ కౌన్సిలర్, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు శారద పోరండ్ల నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు ఎర్రమాద వెంకన్ననేత శనివారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధికి వరల్డ్ వీవర్స్ ఫోరం పనిచేస్తుందన్నారు. తనను ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించినందుకు ఫోరం అధ్యక్షుడు నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ప్రొఫెసర్ సాయన్న

పట్టుదలతో చదివితేనే విజయం

● కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సాయన్న

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితేనే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయన్న అన్నారు. శనివారం బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో జాంకృత్ - 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సింగింగ్, డ్యాన్సింగ్, స్టేజీప్లే, మెహిందీ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ సాయన్న మాట్లాడుతూ విద్యార్థులు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని అప్పుడే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకట్రావ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరసోమయ్య, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ)లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పెరిక యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు ఉచిత రెసిడెన్షియల్ (వసతి)తో పాటు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. డీఈడీ (టీటీసీ), బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై టీఆర్‌టీ (డీఎస్సీ)-2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ యజమాని వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థులు ఈ నెల 26లోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడు మృతి

అంబర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడిన సెంట్రింగ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. కాటేదాన్‌లో నివాసం ఉండే మల్లేష్(35) సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న మల్లేష్ అంబర్‌పేట డీడీ కాలనీలో ఓ భవన నిర్మాణంలో సెంట్రింగ్ పనికి వచ్చాడు. పనిచేసే సమయంలో మల్లేష్ భవనంపై నుంచి కిందపడ్డాడు . అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా మల్లేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మల్లేష్ భార్య ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి

● మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
● సంయుక్త కిసాన్ మోర్చా నేతల పిలుపు





భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు, హిందు వాహిని నగర కార్యదర్శి విశ్వేశ్వర్ తదితరులు

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అమరవీరుల స్ఫూర్తితో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కమిటీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈడీ, సీబీఐలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వానికి లొంగని వారిపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్థంతి సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని నింపి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని హిందూవాహిని నగర కార్యదర్శి విశ్వేశ్వర్ (బబ్లూ) కొనియాడారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ హిందూవాహిని ఆధ్వర్యంలో భగత్‌సింగ్ బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా భోలక్‌పూర్ హౌస్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ మాట్లాడుతూ వారి ఆశయాలకు అనుగుణంగా యువత పని చేస్తూ హిందూ ధర్మాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ హిందూ వాహిని నాయకులు శివ, మణికంఠ, రాఘవేందర్, విశాల్, నీరజ్, మురళీ పాల్గొన్నారు.

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్‌లోని పీజీ న్యాయ కళాశాలలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ గుమ్మడి అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సాంబ, హఫీజ్, పృథ్వీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాగభూషణం



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగభూషణం

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాష్ట్ర కనీస వేతనాల బోర్డ్ మాజీ వైస్ ఛైర్మన్ నాగభూషణం, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శనివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగభూషణం మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలుకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

పేదలకు వరం.. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు

● ఉప్పల శ్రీనివాస్ గుప్తా



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానిస్తున్న శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది అని ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలపటంతో శనివారం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. 40 సంవత్సరాలుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు అనేక ప్రయత్నాలు చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 10 సీట్లు కేటాయించాలి

15 లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే మా మద్దతు : ఎంపీ ఆర్.కృష్ణయ్య



విద్యానగర్‌లోని బీసీ భవన్‌వద్ద బీసీ జోడోయాత్రకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 10 సీట్లు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ డిమాండ్లపై విధాన ప్రకటన చేసి తమ మ్యానిఫెస్టోలో పార్టీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన బీసీ జోడోయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు తక్కువ సీట్లు ఇచ్చి అన్యాయం చేశాయని ఆరోపించారు. మొత్తం కేంద్ర బడ్జెట్‌లో 47 కోట్ల 65 లక్షల 768 కోట్ల బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి బిక్షం ఇచ్చినట్లుగా కేవలం 2150 కోట్లు బడ్జెట్ మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన మొత్తం చూస్తే దేశంలో 75 కోట్ల మంది బీసీలకు పంచితే చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు అన్ని పార్టీలు ఇవ్వాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, శివకుమార్, విజయ్, టి.రాజ్‌కుమార్, జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సునీల్‌దాస్ గుండెపోటుతో మృతి

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, ముషీరాబాద్ గౌరీశంకర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సునీల్ దాస్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. సునీల్ దాస్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ కన్వీనర్ రామకృష్ణ ముదిరాజ్, గ్రేటర్ ఉపాధ్యక్షులు లింగం గుప్తా, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్ విశ్వం తదితరులు ఆయన భౌతికకాయం సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలు ముషీరాబాద్ హిందూశ్మశాన వాటికలో నిర్వహించారు.

ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్, కేన్సర్ వ్యాధిగ్రస్తులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సేవలు పొందేవిధంగా యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) భవనంలో ఎన్‌సీడీ, ఆయుష్మాన్ భారత్ పథకాల అమలుపై వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్రిత రెడ్డి, డాక్టర్ సునందా, వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంకా, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



క్రాస్‌రోడ్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షపార్టీల నేతలు

ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ దుర్మార్గమైన చర్య

● వామపక్షాల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను సీజ్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో మోదీ ప్రభుత్వ నిరంకుశ చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ఆధారంగా ఎన్నికైన మోదీ నిరంకుశ పద్ధతుల్లో పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మోదీని, బీజేపీని ప్రశ్నించే వారిని, విమర్శించేవారిపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేసి తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని అన్నారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలపపతిరావు, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ప్రసాద్ మాట్లాడుతూ హిందువులను రెచ్చగొట్టి మత రాజ్యాన్ని స్థాపించాలని మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. డీజీ నరసింహారావు, బాలమల్లేష్, మల్లులక్ష్మి, టి.సాగర్, ఎం శ్రీనివాస్, శ్రీరామ్‌నాయక్, స్కైలాబ్‌బాబు, బాబురావు, అరుణజ్యోతి, పశ్యపద్మ, అనురాధ, వెంకన్న, అరుణ, కోటేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లకు రూ. 2 వేలు

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు రూ.500కు, వాణిజ్య అవసరాలకు రూ.850కు విక్రయిస్తున్నది. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీని భరించలేని మాదాపూర్ ప్రాంతంలోని నివాసితులు కొత్త ఉపాయం పన్నారు. స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల ఇళ్ల పేరిట వాటర్‌బోర్డు ట్యాంకర్‌ను బుక్ చేసుకుని నీటిని తెప్పించుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో..

మాదాపూర్, గుట్టలబేగంపేట ప్రాంతాల్లోని సున్నంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు పెద్దఎత్తున బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను సామర్థ్యాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని జనం వాపోతున్నారు.

25 ప్రాంతాల్లో డిమాండ్

గ్రేటర్ పరిధిలోని 25 ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మాదాపూర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, మియాపూర్, హఫీజ్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, మణికొండ, మూసాపేట, కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, గచ్చిబౌలి, ఎల్లారెడ్డిగూడ, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్‌లకు బుకింగ్‌లు ఎక్కువగా అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 1,300 ట్యాంకర్లు బుకింగ్ కాగా, మార్చి 22న 4,079 ట్యాంకర్లు బుక్ అయ్యాయి.

రెండు నెలల వ్యవధిలోనే మూడింతల డిమాండ్ పెరగడం నీటి కొరత, అవసరానికి అద్దం పడుతున్నది. కాగా బస్తీలతో పాటు ఆలయాలు, మసీదులు తదితర వాటికి జనవరి ఒకటో తేదీన 350 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందిస్తే.. ప్రస్తుతం రోజుకు 637 ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. ముందు మరింత అధికంగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగే అవకాశాలున్నాయి.

ఆ ఏడు డివిజన్లలో 84 శాతం డిమాండ్

వాటర్‌బోర్డు పరిధిలో దాదాపు 580కి పైగా ట్యాంకర్లున్నాయి. వీటి ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు.. రెండు షిఫ్టుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధిలో మొత్తం 24 డివిజన్లు ఉండగా, ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ డిమాండ్ 84 శాతం మేరకు ఉన్నది. అందులో.. 35 శాతం హఫీజ్‌పేట, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి (డివిజన్-15)లలో, 22 శాతం ఎస్ఆర్‌నగర్ (డివిజన్-6)లో, 14 శాతం కూకట్‌పల్లి (డివిజన్-9)లో, 7 శాతం మణికొండ (డివిజన్-18)లో, ఆరు శాతం నిజాంపేట్ (డివిజన్-23)లో డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా నీటిని సరఫరా చేయడానికి అదనంగా మరిన్ని ట్యాంకర్లను సమకూర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పగటి సమయంలోనూ ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ కారణంగా డెలివరీ ఆలస్యమవుతోంది. దీంతో ట్రిప్పుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీంతో రాత్రి సమయాల్లో అదనంగా మరో షిఫ్ట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



రికార్డ్ రూం, కంప్యూటర్ గదిని తనిఖీ చేస్తున్న డీసీపీ ఆకాన్ష్‌యాదవ్

మనం ప్రజలకు అందుబాటులో ఉండాలి

● సెంట్రల్‌జోన్ డీసీపీ ఆకాన్ష్‌యాదవ్

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్‌జోన్ డీసీపీ ఆకాన్ష్‌యాదవ్ సూచించారు. మనం అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శనివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్ మ్యాప్‌ను పరిశీలించారు. లాకప్ గది, ఆయుధాల గది, ఎస్ఐల రూమ్, విశాలమైన బ్యారక్‌లు, కంప్యూటర్ గది, రికార్డ్ రూమ్, రైటర్ రూమ్, విశ్రాంతి గదులు, కమాండ్ కంట్రోల్ రూమ్ వివిధ విభాగాలను పరిశీలించారు. పీఎస్ పరిధిలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఇటీవలి కాలంలో ఎలాంటి క్రిటికల్ కేసులు పరిష్కారమయ్యాయి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు కీలకమైనవని, ఈ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్, ఎస్ఐలు నాగరాజు, యశ్‌పాల్‌రెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



జేసీఎల్ శ్యామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ అధ్యక్షుడు నారాయణ, తదితరులు

వాటర్‌బోర్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, సేవరేజ్ బోర్డులో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోర్డు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు శనివారం జంటనగరాల సంయుక్త కార్మిక కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ వాటర్ బోర్డు యాజమాన్యం ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే వారికి భిన్నమైన వేతనాలు ఇస్తున్నారన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా ఓటీ విధానాన్ని అమలు చేయించాలని, చట్టపరంగా రావాల్సిన సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంయుక్త కార్మిక కమిషనర్‌ను కలిసినవారిలో యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు సంతోష్, రాజారత్నం, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

భారత ఎన్నికల కమిషన్ నిర్ణయం హర్షణీయం

● ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దృష్టితో ఈ ఎన్నికల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని భారత ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను ఆదేశించడం హర్షణీయం అని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పేర్కొంది. శనివారం బాగ్‌లింగంపల్లిలోని కౌన్సిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు సీ.హెచ్.రంగయ్య, జాతీయ కన్వీనర్ ముదిగొండ త్యాగరాజులు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు పర్యావరణ హితకరంగా జరిగేలా ఈసీ పార్టీలు, నాయకులకు సూచించడం ప్రకృతి మనుగడకు కొత్త ఊపిరి పోసినట్లయిందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల నిర్వహణలో అద్భుత పనితీరు చూపుతున్న కేంద్ర ఎన్నికల సంఘం పర్యావరణహితవాదంపై మరింత స్పష్టంగా కేంద్రానికి, రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు అనేకమార్లు, అనేక రాష్ట్రాలు సింగిల్ యూజ్ నిషేధ ఉత్తర్వులు ప్రకటించినా ఆచరణ జరగలేదన్నారు. ఎన్నికల ప్రచారం తారస్థాయిలో జరిగే ఈసారి ఎన్నికలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కట్టడి చేయగలిగితే అది పూర్తిస్థాయి నిషేధానికి పునాది పడుతుందని, అందుకు ఈసీ చొరవ కీలకమన్నారు. దీంతో పాటు ఎన్నికల ప్రచారంలో బైకు ర్యాలీలు, పెద్ద స్థాయి శబ్ధాలు, సాధారణ జనజీవనానికి ఇబ్బంది కలిగించే సభలు, ర్యాలీలు నిషేధించాలన్నారు. మరిన్ని పర్యావరణ హిత చర్యలకు ఈసీ చొరవ తీసుకోవాలని వారు కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలకు దళిత క్రిస్టియన్ దండోరా పోటీ

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలకు దళిత క్రిస్టియన్ దండోరా పోటీ చేస్తుందని వ్యవస్థాపక జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ ఎంపీ స్థానంలో ఎంఐఎంకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని ఆయన వెల్లడించారు. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలను ఏకం చేయడానికి ఈ నెల 27న సూరారం మెయిన్ రోడ్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో దళిత క్రైస్తవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత క్రైస్తవ దండోరా రాష్ట్ర కన్వీనర్ కాసీ సతీష్‌కుమార్ మాదిగ, కో-కన్వీనర్ గట్టు అశోక్‌లతో కలిసి గర్జన సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న 9 మంది అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. మిగత 7 స్థానాల అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. వరంగల్ నుంచి ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కాసీ సతీష్‌కుమార్ మాదిగ, మల్కాజ్‌గిరి నుంచి రఘు ముద్రి పీటర్, సికింద్రాబాద్ నుంచి కొడమంచలి సునీత, మహబూబ్‌నగర్ మామిడి సామ్యేల్, నాగర్‌కర్నూలు నుంచి పుట్టపాగ ఎల్లయ్య, జహీరాబాద్ నుంచి కూనదొడ్డి యిర్మియా, చేవేళ్ల నుంచి బి.అంజన్‌కుమార్, నిజామాబాద్ నుంచి చెంగాల జోసెఫ్‌లు పోటీ చేస్తారని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి బీ ఫామ్‌లు ఇవ్వడంతో పాటు సింహం గుర్తుపై తమ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.

వైవిధ్యం, విశిష్టం నోరి నరసింహశాస్త్రి రచనలు

చిక్కడపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నోరి నరసింహశాస్త్రి రచనలు వైవిధ్యం, విశిష్టమైనవని మాజీడీజీపీ డా.కె. అరవిందరావు అన్నారు. నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో కవి సమ్రాట్ నోరి నరసింహశాస్త్రి 125వ జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అరవిందరావు మాట్లాడుతూ నరసింహశాస్త్రి చారిత్రక నవలా రచయితగానే కాకుండా ఆధ్యాత్మిక తత్వజ్ఞానసాహిత్య రచనలో మేటి అన్నారు. ఈ సందర్భంగా రాంటెక్‌లోని కాళిదాస్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు పెన్నా మధుసూదన్‌కు నోరి పురస్కారం, డా.బులుసు అపర్ణకు యువ రచయిత ప్రోత్సాహక పురస్కారంను అరవిందరావు బహూకరించారు. డా. ముదిగొండశివప్రసాద్, డా. వారణాసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. నోరి శివసేనాని కల్యాణసుందరం, అవార్డ్‌గ్రహీతలను పరిచయం చేశారు. ట్రస్ట్ స్థాపకులు నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షత వహించి ట్రస్ట్ కార్యాక్రమాలువివరించారు.

పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు

● సాధించిన అడిషనల్ ఎస్పీ గంటా వెంకట్రావు



అడిషనల్ ఎస్పీ గంటా వెంకట్రావు

హైదరాబాద్‌సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పుల్లెల గోపీచంద్ అకాడమీలో నిర్వహించిన ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ పోలీస్ అకాడమీలో అడిషన్ ఎస్పీగా పనిచేస్తున్న గంటా వెంకట్రావు రెండు పతకాలు సాధించారు. వెంకట్రావు 1991 బ్యాచ్ ఎస్‌గా ప్రయాణం ప్రారంభించారు. 25 ఏళ్లుగా వెంకట్రావు విధి నిర్వహణతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపుతున్నారు. ఈ ఏడాది పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 55 ప్లస్ కేటగిరిలో 2 రజత పతకాలు సాధించారు. 2017లో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు.